
# పోతనభాగవతంలో రసగుళికలు
## – ఆర్.శర్మ దంతుర్తి



# 91 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 15, చిత్రకేతూపాఖ్యానం-3

క్రితం వ్యాసంలో చిత్రకేతువు నారదుడి దగ్గిర మంత్రోపదేశం పొంది మంచి అనుభూతి పొందుతూ విద్యాధరులకీ, యక్షగణాలకీ నాయకుడై వారితో నారాయణుడి గురించి కీర్తించడం, ఆ మహత్తు వల్ల వచ్చిన సిద్ధులతో అనేకానేక స్థలాలకి విహారం చేయడం చదివాం. అలాంటి విహారంలో కైలాసానికి వచ్చాడు. అక్కడున్న పేరోలగంలో శివుడు పార్వతి వళ్ళో కూర్చోపెట్టుకోవడం చూసి పరమేశ్వరుణ్ణి, మామూలు మనిషికి ఉన్న సిగ్గు కూడా లేదని గేలి చేస్తూ అందరి ముందూ పక పకా నవ్వాడు. శివుడికి కోపం వస్తే ఏదైనా చేయగలడు కదా? అలాగే శివుడు ఎంతటి తప్పునైనా క్షమించగలడు కూడా. అందుకే ఆయన భగవంతుడు.

క. అన విని సర్వేశ్వరుఁ డా
తని నేమియు ననక నవ్వెఁ దత్సభవారుం
గనుగొని యూరక యుండిరి
మనుజేశ్వర! యీశుధైర్య మది యెట్టిదియో? [6-493]

ఇలా చిత్రకేతువు తనని నవ్వే సరికి ఏమైందో శుకమహర్షి చెప్తున్నాడు – ఈ మాట విని సర్వేశ్వరుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఎంతటి మంచి గుణం, ధైర్యం లేకపోతే అలా ఉండగలడో కదా? ఓ విషయం చూద్దాం. దక్షవాటికలో సతి ప్రాణత్యాగం చేసినప్పుడు శివుడు అంత కోపం తెచ్చుకున్నాడే, అటువంటప్పుడు ఇక్కడ అసలు కోపమే ఎందుకు తెచ్చుకోలేదు? దక్షుడు చేసిన పనికి శిక్ష ఆయన గర్వానికి సరిపడినది. ఇక్కడ చిత్రకేతువు దక్షుడి అంతటి పాపం చేసినవాడు కాదు కదా? మరో విషయం ఏమంటే, దక్షుడు శివుణ్ణి దూషించినప్పుడు మొదటి సారీ తర్వాత దూషించినప్పుడూ కూడా శివుడు ఏమీ చేయలేదు, మౌనంగా వెళ్ళిపోయాడంతే. అయితే దక్షుడు దాన్ని లాగి లాగి శివుణ్ణి కావాలని తిట్టడం అదీ చేసేసరికి సతి ప్రాణత్యాగం చేసింది. ఇంకా ఊరుకుంటే ఇటువంటివి పెరగవచ్చు. అదే దక్షుడి సందర్భంలో వీరభద్రుణ్ణి సృష్టించడానికీ, చిత్రకేతువు పట్ల నవ్వి ఊరుకోవడానికి తేడా. మరోవిధంగా చూసినా దక్షుణ్ణి మొదటి సారి క్షమించినట్టే చిత్రకేతువు చూపించిన అజ్ఞానానికి శివుడు నవ్వి ఊరుకున్నాడు.

వ. ఇట్లు దన పూర్వకర్మశేషంబున నింద్రియ జయుండ నని పుట్టిన యహంకారంబున, జగద్గురువుం బెక్కు ప్రల్లదంబు లాడుచున్న చిత్రకేతుం జూచి భవాని యిట్లనియె. [6-494]

అయితే 'నేను నారదుడి మంత్రోపదేశం పొందాక ఇంద్రియ విజయుణ్ణి, ఈ శివుడు మాత్రం అలా అమ్మవార్ని వళ్ళో కూర్చోపెట్టుకున్నాడు కనక సిగ్గులేనివాడు' అనే అహంకారం వల్ల ఇలా జగద్గురువు అయిన శివుణ్ణి చూసి ప్రేలాపన ఆడుతున్న చిత్రకేతువును చూసి అమ్మవారు (భవాని) ఇలా అంది. గమనించవల్సిన విషయం ఏమంటే, ఓ సారి కొన్ని అష్ట అణిమా సిద్ధులు రాగానే, నేను గొప్పవాణ్ణి, నాకేమీ అహంకారంలేదు అనేవి మనసులో ఉదయించడం మొదలుపెడతాయన్నమాట. 'నాకు కోపం లేదు, కామం లేదు, అహంకారం లేదు' అనుకునే అహంకారం కొద్దిగా పెరుగుతూ రాక్షస గుణాలు మళ్ళీ ఒక్కొక్కటీ పెరగడానికి కారణం అవుతుందన్నమాట.

క. మముబోఁటి లజ్జ లుడిగిన
కుమతులకుం గర్త యగుచుఁ గోపింపంగా
నమితాజ్ఞానిపుణుం డగు
శమనుండా నేఁడు వీఁడు జగముల కెల్లన్? [6-495]

మా వంటి వారిని లజ్జ/సిగ్గు లేదని ఆరోపించడానికి జగాలన్నింటికీ నియంత అయిన, నిపుణుడైన యమరాజా (శమనుండా?) ఈ పెద్దమనిషి?

క. భృగు నారద కపిలాదులు
నిగమాంతజ్ఞులును యోగనిర్ణయ నిపుణుల్
త్రిగుణాతీతు మహేశ్వరు
నగ రెన్నఁడు వారు ధర్మనయ మెఱుఁగరొకో? [6-496]

భృగువు, నారదుడు, కపిలుడు లాంటి వేదాలు తెల్సినవారు (నిగమాంతజ్ఞులు), యోగ నిర్ణయం చేయగలవారు కూడా పరమేశ్వరుణ్ణి పరిహసించరు (నగరెన్నడు) ఏనాడూను, వాళ్లకి ధర్మం తెలియదా? ఇంత అన్నాక ఇప్పుడు ఆవిడ చెప్తోంది శివుడు ఎటువంటివాడో. ఇక్కడ ఒక చిన్న కథ చెప్పుకుందాం. హిమవంతుడికి పార్వతిగా జన్మించాక తాను పరమేశ్వరుణ్ణి తప్ప మరెవరినీ పెళ్ళి చేసుకోను అని చెప్తే, శివుడు పెళ్ళికి ముందు పార్వతిని పరీక్షించడానికి కొంతమంది ఋషులని పంపిస్తాడు. వాళ్ళు వచ్చి పార్వతి తో చెప్తారు, "శివుడు డబ్బూ దస్కం లేనివాడు, కపాలం పుచ్చుకుని అడుక్కుంటూ మాసిపోయిన జటలతో అతి భయంకరంగా శ్మశానాల్లో తిరుగుతూ ఉంటాడు. ఆయన్ని చేసుకుని నీకేమీ ప్రయోజనం లేదు. మర్చిపో" అని. దానికి పార్వతి ఏమంటుందంటే, "శివుడు అద్భుతమైన సౌందర్యం, అష్టైశ్వర్యాలు కలవాడు, మీరు చెప్పినది చెప్పారు కనక ఇంక వెళ్లవచ్చు, నా అభిప్రాయం మారదు." కైలాసంలో ఉన్న శివుణ్ణి పాలరంగులో తెల్లగా ఉన్న కొండలమీద ధ్యానంలో ఉన్న శాంత మూర్తిగా ఊహించుకోవచ్చు లేదా శ్మశానంలో తిరిగే బైరాగిలా ఊహించుకోవచ్చు. ఆయన ఎలా మనకి కనిపిస్తాడనేది మన మనసులో భావాలు బట్టి ఉంటుంది. అందుకే శివానందలహిరిలో శంకరులు అనేది.

కరస్థే హేమాద్రౌ గిరిశ నికటస్థే ధనపతౌ
గృహస్థే స్వర్భూజామర సురభి చింతామణిగణే
శిరస్థే శీతాంశౌ చరణయుగళస్థే ఖిలసుభౌ
కమర్ధం దాస్యేహం భవతు భవదర్థం మమ మనః (శివానందలహరి. 27)

సీ. ఎవ్వని పదపద్మ మింద్రాది విబుధుల–

చూడాగ్రపంక్తుల నీడఁ జూచు,
నెవ్వని తత్త్వంబ దెనయంగ బ్రహ్మాది-
యోగిమానసపంక్తి నోలలాడు,
నెవ్వని రూపంబు నేర్పాటు గానక-
వేదంబు లందంద వాద మడఁచు,
నెవ్వని కారుణ్య మీ లోకముల నెల్లఁ-
దనిపి యెంతయు ధన్యతములఁ జేయు [6-497]

తే. నట్టి సర్వేశుఁ బాపసంహారు ధీరు
శాశ్వతైశ్వర్యు నాత్మసంసారు నీశు
నెగ్గు పల్కిన పాపాత్ముఁ డెల్ల భంగి
దండనార్హుండు గాకెట్లు దలఁగఁ గలడు? [6-497.1]

ఎవరి స్వరూపం అర్ధంకాక వేదాలు వాదులాడుకుంటాయో (మొదట్లో చిత్రకేతువు కైలాసం లోకి వచ్చినప్పుడు చెప్పాడు కదా వేదాలు సంభాషించుకుంటున్నాయి భగవంతుడి గురించి అని?), బ్రహ్మాది దేవతలు ఎవరిని చూడడం కోసం అయితే తహతహ లాడుతూంటారో, ఇంద్రాది దేవతలు ఎల్లకాలం ఎవరి పాదాలని చూడాలని ఉవ్విళ్ళూరుతుంటారో అటువంటి సర్వేశ్వరుణ్ణి, పాపసంహారుణ్ణి తూలనాడిన ఈ చిత్రకేతువు దండనార్హుడు కాదా? దాదాపు ఇదే విధంగా సతి తండ్రితో అనడం మనం దక్ష యజ్ఞం లో చూస్తాం. "శివుణ్ణి తూలనాడినిన నీకు కూతురిగా పుట్టడం అంత సిగ్గులేనిది మరోటి లేదు; అలా శివుణ్ణి తూలనాడావు కనక నీ కూతురిగా ఉండడానికి ఇష్టం లేకే నేను ప్రాణత్యాగం చేసుకుంటున్నాను" అని చెప్తుంది, యోగాగ్నిలో దగ్ధం అయ్యేముందు.

తే. నిఖిలలోకాశ్రయంబు సన్నిహితసుఖము
సకలభద్రైక మూలంబు సాధుసేవ్య
మైన కంజాక్షుపాదపద్మార్చనంబు
ననుసరింపంగ ఖలుఁడు వీఁ డర్హుఁ డగునె? [6-498]

అన్ని లోకాలకీ ఆశ్రయమైన, అన్ని సంతోషాలకీ అలవాలమైన, సాధువులు సేవించే విష్ణుపాదాలని (కంజాక్షు – కంజము – పద్మం; అక్షు – కన్నులున్నవాడు; పాదపద్మార్చనంబు) సేవించడానికి ఇటువంటి దుష్టుడు (ఖలుడు) అర్హుడెలా అవుతాడు?

వ. కావున, నోరి! దురాత్మక! యీ పాపంబునం బాపస్వరూపంబైన రాక్షసయోనిం బుట్టు"మని శపియించి "యింతనుండి మహాత్ములకు నవజ్ఞ చేయకుండు"మని పలికినఁ జిత్రకేతుండు విమానంబు డిగ్గి వచ్చి, యద్దేవికి దండప్రణామంబు లాచరించి కరకమలంబులు దోయిలించి యిట్లనియె "నో జగన్మాతా! భవచ్ఛాప వాక్యంబు లట్ల కైకొంటి ప్రాచీన కర్మంబులం బ్రాప్తం బైన సంసార చక్రంబు చేత నజ్ఞాన మోహితులై తిరుగుచున్న జంతువులకు సుఖదుఃఖంబులు నైజంబులై ప్రవర్తిల్లుచుండు; నిందులకుఁ బరతంత్రులైనట్టి వా రాత్మ సుఖదుఃఖంబులకు నెవ్వరు కర్త; లీ గుణంబుల నిమిత్తమై శాపానుగ్రహంబులును స్వర్గ నరకంబులును, సుఖదుఃఖంబులును సమంబులు; భగవంతుం డొక్కండ తన మాయ చేత జగంబులు సృజియించుచు వారి వారికి బద్ధానురాగంబులు గలుగం జేయుచుఁ దాను వానికి లోను గాక నిష్కళుండై యుండు; నీ విధంబునం బుట్టుచున్న నరునకుం బత్ని బంధు శత్రు

మిత్రోదాసీనత్వంబు లెక్కడివి? వారివారి కర్మ వశంబునం బరమేశ్వరుండు కల్పించుచు సర్వసముండై యుండు; నప్పరమేశ్వరునకు సుఖదుఃఖంబుల చేత రాగంబు లేదు రాగానుబంధంబైన రోషంబును లే; దతని మాయా గుణవిసర్గంబు జంతువులకు సుఖదుఃఖంబులను, బంధమోక్షంబులను గల్పించుచుండును; కావున, నీకు నమస్కరించుచున్న నన్ను ననుగ్రహింపుము; శాపభయశంకితుండంగాను; జగన్మాతవైన నిన్నుఁ బలికిన దోషంబునకు శంకించుచున్నవాఁడ"నని దండప్రణామంబు లాచరించి పార్వతీ పరమేశ్వరులం బ్రసన్నులం జేసి తన విమానం బెక్కి చనియె; నప్పుడు పరమేశ్వరుండు బ్రహ్మాది దేవర్షి దైత్య దానవ ప్రమథ గణంబులు వినుచుండఁ బార్వతికి నిట్లనియె "నీకు నిప్పుడు దృష్టం బయ్యెఁ గదా నారాయణదాసానుచరుల నిస్పృహభావంబు; హరి తుల్యార్థదర్శనులై నిస్పృహులైన భాగవతులకు స్వర్గాపవర్గ నరక భేదభావంబులు లేవు; ప్రాణులకు దేహసంయోగంబు వలన నారాయణలీలం జేసి యుండి ద్వంద్వాది సుఖదుఃఖంబు లాత్మ యందు నజ్ఞానంబున భేదంబు చేయం బడియె; నట్టి విపర్యయంబులు భగవంతుండైన వాసుదేవునిభక్తి గలవారిం జెందవు; మఱియును. [6-499]

అలా అని ఊరుకోకుండా ఈ విధంగా శపించింది – "దురాత్ముడా, పాపాలకి నెలవు అయిన రాక్షసుడి గా పుట్టి మహాత్ములని అవహేళన చేయకు." ఇలా శాపం ఇచ్చేసరికి చిత్రకేతువుకి వళ్ళు దగ్గిరకి వచ్చి నిజం తెలిసింది. విమానం దిగి వచ్చి చేతులొగ్గి వేడుకుంటున్నాడు. "కర్మ వశం వల్ల ఇలా అన్నాను. ఇలా అన్నందుకు క్షమించు, నువ్వు ఇచ్చిన శాపానికి భయంలేదు కానీ నిన్ను ఆ మాట అన్నందుకే భయపడుతున్నాను. నన్ను అనుగ్రహించు."

ఇలా అనేసి వాడు వెళ్ళాక శివుడు పార్వతితో చెప్తున్నాడు చిత్రకేతువు తనని చూసి నవ్వినందుకు తానెందుకు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడో. నారాయణ భక్తులకి సర్వత్రా భగవంతుణ్ణే దర్శిస్తారు గానీ వేరు లేదు. నారాయణ లీల వల్ల ద్వందాది సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి.

ఉ. నేనుఁ, గుమారనారదులు, నీరజగర్భుఁడు, దేవసంఘమున్,
మానిత యోగివర్య ముని మండల, మిట్లగు వార మందఱున్
దానవవిద్విడంశ జనితంబులమయ్యుఁ దదీయ తత్త్వముం
గానఁగ నేర; మీశు ఘనగర్వమునం దలపోసి చూచుచున్. [6-500]

నేను, కుమారస్వామి, నారదుడు, బ్రహ్మదేవుడు (నీరజ గర్భుడు – పద్మంలో పుట్టినవాడు), దేవతలు అందరూ కూడా విష్ణువు అంశతో పుట్టినవాళ్లమే కానీ ఆయనని పూర్తిగా తెలుసుకోలేకపోతున్నాం. ఈ పద్యంలో విష్ణువు అనేమాట ఎక్కడుందో చెప్పగలరా? దానవవిద్విడంశ – దానవ = రాక్షస, విద్విట్ = ద్వేషించేవాడు.

ఆ. అరయఁ జిత్రకేతుఁ డతిశాంతుఁ డతిలోక
సముఁడు విష్ణుభక్తి సంగతుండు
నితని నేమిచెప్ప? నీశుండ నగు నేను
నువిద! యచ్యుతప్రియుండఁ జుమ్మి. [6-502]

ఈ చిత్రకేతువు సాధారణంగా శాంతమూర్తి, విష్ణుభక్తుడు. అంతకంటే ఏమి చెప్పాలి? ఇదెందుకు చెప్పాడంటే, అతని నోట్లోంచి అటువంటి మాటలూ, నవ్వడం రావడానిక్కారణం కూడా నారాయణ ప్రభావమే కానీ ఈ చిత్రకేతుడి అసలు స్వభావం కాదు సుమా అని చెప్పడానికి.

క. కావున భగవద్భక్తుల
భావమునకు విస్మయంబు పనిలేదు మహా
ధీ విభవశాంత చిత్తులు
పావన పరతత్త్వనిపుణ భవ్యులు వారల్. [6-503]

నువ్వు శాపం ఇచ్చాక కూడా తాను శాంతంగా నిన్ను క్షమించమని అడిగాడే గానీ కోపం తెచ్చుకోలేదు కదా? అందువల్ల భవగంతుని భక్తుల పట్ల మనం ఆశ్చర్యపోవాల్సిన పని కానీ కోపం తెచ్చుకోవాల్సిన పనికానీ లేదు.

అలా చిత్రకేతుడు పార్వతి ఇచ్చిన శాపం వల్ల వృత్రాసురిడిగా పుట్టి, ఇంద్రుడి చేతిలో పోయాడు. ఒక విషయం గమినిస్తే మనకి అర్ధం అయ్యేదేమంటే, తనని శరణువేడిన వాడిని భగవంతుడు దగ్గిరుండి మరీ నడిపిస్తాడని. చిత్రకేతువు రాక్షసుడిగా ఒక్కడో పుట్టవచ్చు, ఏవో తింటూ తిరుగుతూ జీవితం చాలించవచ్చు. కానీ అలా అయితే వైకుంఠం ఎలా చేరుతాడు తన భక్తుడు? అందువల్ల, ఇంద్రుడికి నారాయణ కవచం ఇచ్చిన అన్నకి, తమ్ముడిగా పుట్టడం. ఏ నారాయణ కవచం వల్ల అయితే ఇంద్రుడు శక్తిమంతుడయ్యాడో అతని చేతే సంహరింపబడటం, ఆ సంహరించబడటం కూడా నారాయణ భక్తుడైన ధధీచి ఇచ్చిన అస్థికలతో తయారైన వజ్రాయుధంతో. అలా అన్నీ కుదిరాక యుద్ధంలో వీరమరణం చెందడం, దానివల్ల మరో జన్మ లేకుండా తేజస్సు భగవతుడిలో కలవడం.

సీ. నరనాథ! యీ వృత్రునకు రాక్షసాకృతి-
గలిగిన యీ పూర్వకారణంబు
చిరపుణ్యుఁ డయినట్టి చిత్రకేతు మహాను-
భావంబు భక్తితోఁ బరఁగ విన్న
చదివినవారికి సకల దుష్కర్మముల్-
శిథిలంబులై కడుఁ జెదరిపోవు
సకలవైభవములు సమకూరుఁ దనయంతఁ-
దొల్కాడు కోర్కులతోడఁ గూడి [6-505]

ఆ. నిర్మలాత్ము లగుచు నిత్యసత్యజ్ఞాన
నిరతు లగుచు విగత దురితు లగుచు
బంధు మిత్ర పుత్ర పౌత్రాదులను గూడి
యనుభవించుచుందు రధిక సుఖము. [6-505.1]

కథ ముగిస్తూ శుకమహర్షి చెప్తున్నాడు, ఈ కథ విన్నవాళ్లకీ చదివిన వాళ్లకీ దుష్కర్మలు శిథిలమైపోయి సకల వైభవాలు కలుగుతాయి అని. అంటే దీని అర్ధం ఏమంటే, ఇది చదువుతూ ఉంటే మనసు నిర్మలం అవడం మొదలై భగవంతుడి గురించి ధ్యానం చేయడం మొదలుపెడతాం. అలా దారిలో పడి ఓ రోజుకి జ్ఞానం కలుగుతుంది. అదే నిత్య సత్య జ్ఞానులవడం, నిర్మలాత్ములవడం, అధిక సుఖం అనుభవించడం అంటే.

ఈ కధ మొత్తం అంతా మరో సారి అవలోకనం చేసుకుందాం. మొదట్లో దక్షుడు పిల్లలని ప్రజోత్పత్తి చేయమంటే వాళ్ళు ఒప్పుకోకపోవడం, తర్వాత కన్న ఆడపిల్లల వల్ల ప్రజోత్పత్తి, అక్కడనుంచి ఎవరు ఎవరికి పుట్టారనేది. విశ్వరూపుడి వృత్తాంతం; ఇంద్రుడు బృహస్పతిని సరిగ్గా చూడకపోవడం, విశ్వరూపుణ్ణి గురువుగా తెచ్చుకుని ఆయన్ని సంహరించడం, వృత్రాసురుడు పుట్టాక వాణ్ణి చంపడం కోసం ధధీచి అస్థికలు సంపాదన, అలా సాగి సాగి మొత్తం కధంతా భగవంతుడి చుట్టూ తిరుగుతూ ఎవరు ఎలా భగవంతుడిలో చేరాలో, చేరవచ్చో చెప్తూ సాగుతుంది. మధ్య మధ్యలో మనకి సందేహాలు వచ్చినట్టే పరీక్షిత్తు ఇదెలా, అదెలా అని అడుగుతుంటే మరిన్ని విషయాలు బయటకి వస్తాయి. మొత్తానికి తెలిసేది మాత్రం భగవద్విభూతి అనేది ఎలా ఉంటుందనేది. అందుకే ఇది భాగవత కధ, భగవంతుడి అంశలేని పరమాణువు లేదు సృష్టిలో. మంత్రపుష్పంలో చెప్పినట్టూ

నారాయణ మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం
నారాయణ పరో జ్యోతిరాత్మా నారాయణః పరః
నారాయణం పరం బ్రహ్మ తత్వం నారాయణ పరః
నారాయణ పరోధ్యాతా ధ్యానం నారాయణః పరః

వచ్చే వ్యాసం నుంచీ మరో భాగవత కధ.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS